# ఓటు హక్కు విధిగా వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



వయోవృద్ధులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 6: దివ్యాంగులు, వయోవృద్ధులు తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం నగరంలోని గాంధీరోడ్‌లో గల ప్రభుత్వ దివ్యాంగులు, వయోవృద్ధుల వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎనభై ఏళ్లు పైబడ్డ వృద్ధులు, పోలింగ్ స్టేషన్‌కు వెళ్లలేని దివ్యాంగుల కోసం ఎన్నికల కమిషన్ ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే వీలు కల్పించిందన్నారు. అందుకోసం అర్హత ఉన్నవారంతా 12డి ఫారం నింపాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు, బీఎల్‌వోలు సహకరించి, ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ వికలాంగులు, వయోవృద్ధుల వసతిగృహంలో ఉన్న వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సంబంధిత అధికారులు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. దివ్యాంగులు, వయోవృద్ధులు తమ ఓటు హక్కు వినియోగించుకుని, ఇతర ఓటర్లకు ఆదర్శంగా నిలువాలని పిలుపునిచ్చారు. అలాగే, జిల్లాలోని అన్ని వయోవృద్ధుల ఆశ్రమాల్లో ఉంటున్న వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వయోవృద్ధులు, వికలాంగుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిలాల సంక్షేమాధికారి సరస్వతి, అడిషనల్ డీఆర్‌డీవో సంధ్యారాణి, డీఎస్‌టీడీవో రాజేశ్వరి, ఎఫ్ఆర్‌వో స్వర్ణలత, వార్డెన్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

***నోడల్ అధికారులకు దిశానిర్దేశం***

ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం రాత్రి ఆమె ఎన్నికల విధులపై వివిధ విభాగాల నోడల్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. సివిజిల్, సువిధ యాప్‌లో వచ్చే ఫిర్యాదులు, దరఖాస్తులపై తక్షణమే స్పందించాలని సూచించారు. జిల్లాలో మద్యం, నగదు, కానుకల పంపిణీ జరుగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా బెల్ట్‌షాపులు పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల మీదుగా వెళ్లే ప్రైవేట్, ప్రభుత్వ వాహనాలు, అంబులెన్సులు, పోలీస్, రెవెన్యూ వాహనాలు కూడా తనిఖీ చేయాలని చెప్పారు. ఫిర్యాదులు చేసే వారి వివరాలు గోప్యంగా ఉంచాలని, వాహనాల తనిఖీ సమయంలో ఖచ్చితంగా వీడియో రికార్డింగ్ చేయాలని సూచించారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి మాట్లాడుతూ, ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన రాజకీయ నాయకులతో పాటు ఆ పార్టీలకు అనుకూలంగా వ్యవహరించే ప్రభుత్వ సిబ్బందిపై కూడా ఆర్‌పీ 128 ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మహేశ్వర్, లక్ష్మీకిరణ్, ప్రఫుల్ దేశాయ్, ఎస్ రాజు, డీఆర్‌వో పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## మంత్రి గంగుల కమలాకర్ గెలువాలని పూజలు

కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ భారీ మెజార్టీతో గెలువాలని కోటిలింగాల వద్ద సోమవారం బీఆర్ఎస్ చేగుర్తి గ్రామాధ్యక్షుడు గాండ్ల కొమురయ్య దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలని శివుడిని వేడుకున్నారు.

-కరీంనగర్ రూరల్, నవంబర్ 6



ఆలయంలో పూజలు చేస్తున్న కొమురయ్య దంపతులు

## మూడో రోజు 9 నామినేషన్లు

కరీంనగర్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడో రోజైన సోమవారం 8 మంది అభ్యర్థులు 9 నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో కరీంనగర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ అఖిల్ సాహెద్, బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్ నామినేషన్ వేశారు. మానకొండూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా యువరాజు శనిగరపు ఒక నామినేషన్ మాత్రమే దాఖలైంది. హుజూరాబాద్ నుంచి రమేశ్ బలిరాజ్ పార్టీ నుంచి 1, స్వతంత్ర అభ్యర్థిగా మరొక నామినేషన్ దాఖలు చేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా గట్టయ్య యాదవ్ బరిగెల, బండి శ్రీనివాస్, రాపోలు రాంకుమార్ భరద్వాజ్, ఎంసీపీఐ అభ్యర్థిగా వీరస్వామి గౌడ్ జక్కె ఒక్కో నామినేషన్ వేశారు. కాగా, చొప్పదండి నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. కాగా, జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు 17 నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి.

## విద్యార్థికి అభినందన

కమాన్‌చౌరస్తా, నవంబర్ 6: అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థి స్నేహిత్ చంద్రారెడ్డి జాతీయ స్థాయి సెస్టో బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెస్టోబాల్ క్రీడకు చాలా ప్రత్యేకత ఉన్నదని, విదేశాల్లో గొప్ప క్రీడగా గుర్తింపు పొందిందని చెప్పారు.



విద్యార్థిని అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న డీఈవో జనార్దన్ రావు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 6: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని, అందుకోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నదని జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు పేర్కొన్నారు. మంకమ్మతోటలో సాయిమానేర్ పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలల కాంగ్రెస్ జిల్లా స్థాయి ప్రదర్శనను సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఎన్‌సీఎస్‌సీ వేదికగా నిలుస్తుందని, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను ప్రాజెక్టులుగా రూపొందించాలన్నారు. సైన్సు అధికారి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, వివిధ పాఠశాలల నుంచి 97 ప్రాజెక్టులు వచ్చినట్లు తెలిపారు. జిల్లా నుంచి నాలుగు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి మారం స్వదేశ్ కుమార్, మానేరు పాఠశాలల చైర్మన్ కడారు అనంతరెడ్డి, డైరెక్టర్ సునీతా రెడ్డి, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్ ఫోరం అధ్యక్షుడు ఎం శ్రీనివాస్, వీ ఆంజనేయులు, న్యాయనిర్ణేతలుగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి, కేవీఎస్ అనంతాచార్య, జే మనోహర్ రెడ్డి, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎస్సారార్‌లో 'పిల్లల కోసం' కార్యక్రమంపై శిక్షణ

కమాన్‌చౌరస్తా, నవంబర్ 6: స్థానిక ఎస్సారార్ కళాశాలలో ప్రాథమిక స్థాయి విద్యలో గుణాత్మకమైన మార్పు తీసుకురావడానికి చేపట్టిన 'పిల్లల కోసం' కార్యక్రమానికి సంబంధించిన సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ మాట్లాడుతూ, 'తొలిమెట్టు' కార్యక్రమానికి అనుబంధంగా ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పని చేస్తుంది. ఇందులో భాగంగా కళాశాల వలంటీర్లు సమీపంలోని ఒక ప్రాథమిక పాఠశాలలో చదువులో వెనుకబడిన 15 మంది విద్యార్థులను దత్తత తీసుకుని ఆటపాటలతో విద్యాబోధన చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ వరప్రసాద్, డీడీ నాయుడు, బీ సురేశ్‌కుమార్, బీ చంద్రమౌళి, డాక్టర్ బీ శారద, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన విద్యార్థులు

## బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పని చేస్తాం

తెలంగాణచౌక్, నవంబర్ 6: రాష్ట్రంలో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పని చేస్తామని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు స్పష్టం చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం ఆయన జిల్లా కమిటీ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ అహర్నిశలు పాటు పడుతున్నారని తెలిపారు. ఓసీ జేఏసీ తరపున రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తామని చెప్పారు.

## జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు

కొత్తపల్లి, నవంబర్ 6: ఈనెల 7 నుంచి 10 తేదీ వరకు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగే 38వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు కరీంనగర్‌కు చెందిన ఎడ్ల విష్ణువర్ధన్ ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. విష్ణువర్ధన్‌తో పాటు కోచ్ వరుణ్ కృష్ణన్‌ను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజవీరు, సీనియర్ క్రీడాకారులు హరికిషన్, రమేశ్, రాజగోపాలాచారి, కనకం సమ్మయ్య, సుమన్, కళ్యాణ్ తదితరులు అభినందించారు.

## బీసీ జనగణన చేపట్టాలి

తెలంగాణచౌక్, నవంబర్ 6: దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీల జనగణన చేపట్టాకే ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనకు రావాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జల కాంతం డిమాండ్ చేశారు. నగరంలోని ప్రజా సంఘాల జేఏసీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలను అణచివేయాలని ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.సమావేశంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, గజ్జల ఆనంద్‌రావు, ఎస్కే సుల్తానా, సంజీవ్, అనిల్ పాల్గొన్నారు.

## కొత్తపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ

రాంనగర్, నవంబర్ 6: కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి సోమవారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గల సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

***నగరంలో పటిష్ట బందోబస్తు***

నగరంలో ఎన్నికల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. కమిషనరేట్ వ్యాప్తంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీస్ పరంగా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఇందుకుగాను అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ (శాంతి భద్రతలు)ను నియమించినట్లు పేర్కొన్నారు. సాధారణ బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బందితో పాటు మూడు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ ముగిసేలా భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.



కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీపీ అభిషేక్ మహంతి

## ఓటు హక్కు వినియోగంపై కళాజాత

కలెక్టరేట్, నవంబర్ 6: అసెంబ్లీ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ లక్ష్యంగా ఎన్నికల సంఘం విశేష కృషి చేస్తున్నది. ఇందుకోసం స్వీప్ ఆధ్వర్యంలో పలు రకాల ప్రచార కార్యక్రమాలు చేపడుతుండగా, కళాబృందాలతో కూడా జిల్లా వ్యాప్తంగా ఓటర్లను చైతన్యపరుస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం నగరంలోని కోతిరాంపూర్, కట్టరాంపూర్, అలకాపురి, గణేశ్‌నగర్, తదితర ప్రాంతాల్లో సాంస్కృతిక సారథి కళాబృందాలు ఓటు హక్కు వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో కళాకారులు దుర్గం మురళి, వొల్లాల వాణి, గొల్లపల్లి శ్రీకాంత్‌చారి, పుల్ల శ్రావన్, చిలుముల రాధ, సంధ్య, అర్చన పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

కరీంనగర్ రూరల్, నవంబర్ 6: వరి ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఆర్‌డీవో శ్రీలత రైతులకు సూచించారు. మండలంలోని ఎలబోతారం, చామనపల్లి, బహద్దూర్‌ఖాన్‌పేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో మాట్లాడుతూ, ప్యాడీ క్లీనర్ ద్వారా పట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని రైతులకు సూచించారు.డీపీఎం ప్రవీణ్, ఏపీఎం భార్గవ్, రాజేశం పాల్గొన్నారు.